AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in






# అధికార లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు.. హాజరైన ఐజీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** హత్యకు గురైన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ అంత్యక్రియలను అధికార లాంఛనాల మధ్య శనివారం నిర్వహించారు. నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్డులో అంత్యక్రియలు చేశారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య నగరంలోని కంఠేశ్వర్‌లోని న్యూ బ్యాంక్ కాలనీలో ఉన్న ప్రమోద్ స్వగృహానికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీస్ శాఖ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం అధికారిక లాంఛనాల మధ్య ప్రమోద్ అంత్యక్రియలు నిర్వహించారు. సీపీతో పాటు డీసీపీ ఇతర పోలీస్ అధికారులు ప్రమోద్ పాడెను మోశారు. ప్రమోద్ మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు అక్కడి వారిని కంట తడి పెట్టించాయి. అంత్యక్రియల్లో అడిషనల్ డీసీపీ బస్వారెడ్డితో పాటు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు, నగర సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీస్ వెల్ఫేర్ సంఘం ప్రతినిధులు, భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారు.



గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసు సిబ్బంది



నిజామాబాద్ నగరంలో మూసి ఉన్న వ్యాపార సంస్థలు

# బీసీ బంద్ ప్రశాంతం

- 42శాతం రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాల పోరాటం
- వ్యాపార, విద్యాసంస్థలు క్లోజ్
- మద్దతు తెలిపిన అఖిలపక్షం నాయకులు

**అక్షరటుడే, ఇందూరు/కామారెడ్డి:** ఉమ్మడి జిల్లాలో బీసీ బంద్ విజయవంతమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశంతో తలపెట్టిన బంద్‌కు శనివారం విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు, మర్చంట్ అసోసియేషన్లు స్వచ్ఛందంగా మద్దతు తెలిపాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వేకువజామున బీసీ సంఘాల నాయకులు ఆర్టీసీ డిపోల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఆర్టీసీ బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. బస్టాండ్ ప్రాంగణాలన్ని బోసిపోయాయి. నిజామాబాద్ నగరంలోని బస్టాండ్ నుంచి గాంధీ చౌక్, నెహ్రూ పార్క్, రాజారాజేంద్ర థియేటర్, పులాంగ్, హైదరాబాద్ రోడ్డు పాత కలెక్టరేట్ మీదుగా బీసీ జేఏసీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలో జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు కొత్త బస్టాండ్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. జిల్లా జేఏసీ నాయకులు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.


– మిగతా 2వ పేజీలో




కామారెడ్డి బస్టాండ్‌లో నిలిచి ఉన్న బస్సులు..



నిజామాబాద్ నగరంలోని డిపో–1 వద్ద జేఏసీ నాయకుల ఆందోళన




నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

# మంటగలిసిన మానవత్వం..

**నడిరోడ్డుపై హత్య జరిగినా పట్టించుకోని జనం**

**అక్షరటుడే, నిజామాబాద్:** 'మాయమైపోతున్నడమ్మా.. మనిషన్నవాడు.. మచ్చుకైన లేడు చూడు..' అని రచయిత అందెశ్రీ రాసినట్లుగా నేటి సమాజం తయారైంది. తోటి మనిషి ఆపదలో ఉన్నా ఆదుకునే వాడే కరువయ్యాడు. మానవత్వం మంటగలిసిపోయిందనడానికి సజీవ సాక్ష్యమే.. నిజామాబాద్ నగరంలో జరిగిన హత్యోదంతం. నగరం నడిబొడ్డున ఓ కానిస్టేబుల్ దారుణహత్యకు గురయ్యాడు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి కత్తితో దాడి చేసి నడి రోడ్డుపై జనాలు చూస్తుండగానే కానిస్టేబుల్‌ను పొడిచి చంపాడు. అయినప్పటికీ ఘటనా స్థలంలో గుమిగూడిన జనం ఏ ఒక్కరూ కూడా అడ్డుకోవడానికి కనీస ప్రయత్నం చేయలేదు. పైపెచ్చు ఈ దృశ్యాన్ని వీడియోలు తీస్తూ నిల్చుండిపోయారే తప్ప.. పోలీసులు సాయం కోరినా గాయపడిన కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించడానికి కూడా సహకరించకుండా మానవత్వాన్ని మరిచారు.



### చోద్యం చూసిన జనం.. సీపీ ఆవేదన

కానిస్టేబుల్‌పై నిందితుడు కత్తితో దాడి చేసిన సమయంలో అక్కడే ఉన్న జనం వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇదే విషయమై సీపీ సాయిచైతన్య సైతం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఘటనా స్థలంలో జనం వ్యవహరించిన తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. 'దాడి జరిగిన సమయంలో పోలీసులు సాయం కోరితే ఎవరూ ముందుకు రాలేదు. జనం పక్కనే ఉండి ఫొటోలు, వీడియోలు తీసుకున్నారే తప్ప ఏ ఒక్కరూ సాయం చేయలేదు. ఆస్పత్రికి తీసుకువెళ్లడానికి ఆటోవాలాలూ సహకరించలేదు. పోలీసు అనే కాదు ఎవరైనా సరే ఆపదలో ఉంటే కనీసం స్పందించకపోవడం సరైందికాదు. ఓ వ్యక్తి రోడ్డుపై పడిపోయి ఉంటే సాయం చేయకుండా వదిలేసి వెళ్తే.. సొసైటీ ఎలా ముందుకు వెళ్తుందని' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాలుగో టౌన్ పరిధిలో ఉన్న వినాయక్‌నగర్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన కానిస్టేబుల్ హత్యోదంతం రాష్ట్రంలో సంచలనంగా మారింది. నిజామాబాద్ నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన రియాజ్ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. అతడిని అరెస్ట్ చేసేందుకు శుక్రవారం రాత్రి కానిస్టేబుల్ ప్రమోద్, సహచర సిబ్బందితో కలిసి వెళ్లాడు. నిందితుడిని బైక్‌పై ఎక్కించుకుని స్టేషన్‌కు వెళ్తుండగా.. మార్గ మధ్యలో కానిస్టేబుల్‌పై నిందితుడు కత్తితో దాడికి తెగబడ్డాడు. సీసీఎస్ ఎస్సై విఠల్ కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా.. ఈ అంశం ప్రస్తుతం పోలీస్ శాఖతో పాటు ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది.

మద్యం టెండర్లపై వ్యాపారులు ఆసక్తి చూపలేదా..? గతంలో కంటే రూ. లక్ష అదనంగా పెరగడంతో టెండర్లు వేసేందుకు వెనుకంజ వేశారా..? లక్ష ఎక్కువ పెట్టి టెండర్ వేసి తీరా రాకపోతే నష్టపోతామని భావించారా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. గతంలో రూ. 2 లక్షలు ఉన్న దరఖాస్తు ఫీజు ఈసారి ఏకంగా రూ. లక్ష పెరగడంతో టెండర్ వేయడానికి ఆసక్తి చూపలేదన్న టాక్ వినిపిస్తోంది. గతంలో వచ్చిన టెండర్ల కంటే ఎక్కువ వస్తాయని అధికారులు భావించారు. అందుకు తగినట్టుగా వ్యాపారులను మోటివేట్ కూడా చేశారు. కానీ చివరికి అనుకున్నంత స్థాయిలో దరఖాస్తులు రాలేదు. దీంతో టెండర్లు పెరిగేలా మరింత సమయం ఇస్తారన్న వాదన వినిపిస్తోంది. - అక్షరటుడే, కామారెడ్డి/ నిజామాబాద్ సిటీ



# కిక్కివ్వని మద్యం టెండర్లు

- అనుకున్నన్ని టెండర్లు రాని వైనం
- అధికారుల ప్రయత్నాలు విఫలం
- దరఖాస్తుకు ముందుకు రాని వ్యాపారులు

మద్యం టెండర్లు ఎక్సైజ్ శాఖకు కిక్ ఇవ్వలేదు. టెండర్లపై అధికారుల లెక్క తప్పింది. చివరి నాలుగు రోజుల్లో భారీగా దరఖాస్తులు వస్తాయని అధికారులు భావించినా.. వ్యాపారులు షాకిచ్చారు. గతంలో 2,200 దరఖాస్తులకు పైగా రావడంతో ఈసారి అంతకు రెట్టింపు దరఖాస్తులు వస్తాయని అధికారులు ఆశలు పెట్టుకున్నారు. తీరా గడువు తీరే సమయానికి అనుకున్న ప్రకారం టెండర్లు దాఖలు కాకపోవడంతో అధికారులు అయోమయంలో పడిపోయారు.

### ఆసక్తి చూపని వ్యాపారులు

మద్యం టెండర్లకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదన్న ప్రచారం సాగుతోంది. టెండర్ ఫీజు లక్ష రూపాయలు పెరగడం కూడా వ్యాపారులు టెండర్ వేయకపోవడానికి ఒక కారణమని తెలుస్తోంది. ఒకవేళ టెండర్ వేసినా వ్యాపారం అంతగా లాభిస్తుందా అనే అనుమానంతో కూడా టెండర్ వేయడం లేదని తెలుస్తోంది. గతంలో వ్యాపారం చేసిన వారి ద్వారా వివరాలు తెలుసుకుని వెనక్కి తగ్గారన్న వాదన కూడా వినిపిస్తోంది. మద్యం కన్నా ఇతర వ్యాపారంపై పెట్టుబడి పెడితే నయమనే ఆలోచనతో వ్యాపారులు ఉన్నట్టుగా తెలుస్తోంది.

### గతంలో కంటే తక్కువ టెండర్లు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మద్యం టెండర్లకు ఈ సారి దరఖాస్తులు తక్కువ సంఖ్యలో వచ్చాయి. నిజామాబాద్ జిల్లాలో గత ఏడాది 3,578 దరఖాస్తులు రాగా.. ఈ యేడు వాటి సంఖ్య 2,229కి తగ్గింది. ఇక కామారెడ్డి జిల్లాలో గత సంవత్సరం 2,204 దరఖాస్తులు వచ్చాయి. కాగా.. గురువారం రాత్రి వరకు 833 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అయితే సుమారు 15 వందలలోపే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# నిజామాబాద్ వైద్య కళాశాలలో పెరిగిన సీట్లు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ వైద్య కళాశాలలో పీజీ సీట్లు పెరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. పీడియాట్రిక్ విభాగంలో నాలుగు పీజీ సీట్లు పెంచారని.. పాత మూడు సీట్లతో కలిపి ఇప్పుడు మొత్తం ఏడు సీట్లకు పెరిగాయని పేర్కొన్నారు. డెర్మటాలజీ విభాగంలో నాలుగు పీజీ సీట్లు కొత్తగా అందుబాటులోకి వచ్చాయని వివరించారు. పీజీ సీట్లు పెరగడంతో మరింత సేవలు మెరుగవుతాయని హర్షం వ్యక్తం చేశారు. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ జలగం తిరుపతి రావు, డాక్టర్ నాగమోహన్, డాక్టర్ కిషోర్, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ, ఆఫీస్ సూపరింటెండెంట్ నాగరాజు సహకారంతోనే సాధ్యమైందని తెలిపారు.

# కానిస్టేబుల్ దారుణహత్యను తీవ్రంగా ఖండిస్తున్నా : ఎంపీ

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. నడిరోడ్డుపై ఓ రౌడీషీటర్ పోలీస్ కానిస్టేబుల్‌ను హత్య చేయడం దారుణమన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో శాంతిభద్రతలు అధ్వాన స్థితికి చేరాయని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. ఆఖరుకు పోలీస్ సిబ్బందికి కూడా భద్రత లేని పరిస్థితి తయారైందన్నారు. రౌడీషీటర్లు ఏకంగా పోలీసులపైనే దాడులు చేసే పరిస్థితి వచ్చిందని.. ఇది ఆందోళనకరమైన విషయమన్నారు. కానిస్టేబుల్‌ను హత్యచేసిన నిందితుడు రియాజ్‌ను త్వరగా పట్టుకోవాలని.. బాధిత పోలీసు కుటుంబానికి న్యాయం చేయాలని ఎంపీ కోరారు. ఓటు బ్యాంక్ రాజకీయాలకు లొంగకుండా.. నేరస్థుడికి కఠినశిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.





# అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించవద్దు: ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించవద్దని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో కలిసి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న రూ.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కలిసి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యతను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. రోడ్లు, డ్రెయినేజీ వంటి నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే, కాంట్రాక్టర్లపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే రీవర్క్ చేయిస్తామన్నారు.


నగరంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


ఎల్లారెడ్డి పట్టణంలో..


ఇందల్వాయిలో..


కామారెడ్డి పట్టణంలో బస్టాండ్ ఎదురుగా జేఏసీ నిరసన

# బీసీ బంద్ ప్రశాంతం


ప్రయాణికులు లేక బోసిపోయిన నిజామాబాద్ బస్టాండ్..


గాంధారి మండల కేంద్రంలో..


పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో..


పోతంగల్ మండల కేంద్రంలో..


ఇందల్వాయిలో..


కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో..


ఆర్మూర్‌లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో..


ఆర్మూర్‌లోని బీజేపీ ఆధ్వర్యంలో..


బాల్కొండ మండల కేంద్రంలో..


శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద..

## ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం..



**అక్షరటుడే, బాన్సువాడ:** ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటన బాన్సువాడ మున్సిపాలిటీ శివారులో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న బస్సు స్టీరింగ్ ఒక్కసారిగా ఎడమ వైపుకు లాగింది. దీంతో బస్సు నియంత్రణ తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిందని డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనలో బస్సు ముందు భాగంలోని రెండు టైర్లు ఊడిపోయాయి. బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉండగా, డ్రైవర్, కండక్టర్‌తో కలిపి 11 మందికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



## ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పథ సంచలన్

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కమ్మర్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో శనివారం పథ సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 200 మందికిపైగా స్వయం సేవకులు పాల్గొన్నారు. సంఘం ప్రారంభించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. హిందువుల ఐక్యత కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మరియాల నాగభూషణం, ఉట్నూర్ రాజశేఖర్, పేట గంగారెడ్డి, రుద్ర మధుసూదన్, పసుపుల వినీత్, రవిచంద్ర వర్మ, భోగ రామస్వామి, గుండోజీ శ్రీకాంత్, బోండ్ల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆహ్వానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలో ఈనెల 24న రేణుక ఎల్లమ్మ జమదగ్ని–చింతల పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు కళ్యాణ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, సీతక్క, వాకిటి శ్రీహరిలకు ఆహ్వాన పత్రికను అందజేసినట్లు ఎల్లారెడ్డి గౌడ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఆయనను శనివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 24 నుండి 28 వరకు నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు బ్రాహ్మణ పురోహితులతో పూజా కార్యక్రమాలు, ఎల్లమ్మ తల్లి బోనాలు కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మంత్రులకు ఆహ్వానపత్రిక అందజేసిన వారిలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ ప్రశాంత్ గౌడ్, బాలకిషన్, శ్రీనివాస్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, కిషన్ గౌడ్, నారా గౌడ్, సిద్ధాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోళ్లను వేగవంతం చేయాలి



**అక్షరటుడే, కోటగిరి:** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. పోతంగల్ మండల కేంద్రంలోని సొసైటీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రక్‌షీట్లపై సొసైటీ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ సొసైటీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం త్వరగా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమయ్యేలా చూడాలని సూచించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్, డీసీవో శ్రీనివాస్ రావు, తహశీల్దార్ గంగాధర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, చందర్, క్లస్టర్ ఆఫీసర్ అంబర్ సింగ్, ఎస్సై మరియా పుష్పకుమారి, ఏవో నిషిత, ఎండీ రియాజుద్దీన్, ఏఈవో సుప్రియ, సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

## శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలి: అడిషనల్ కలెక్టర్



**అక్షరటుడే, బోధన్:** పట్టణవాసులకు పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. బోధన్ మున్సిపాలిటీపై శనివారం ఆయన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ముందుగా కమిషనర్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పట్టణ శివారులోని డంపింగ్ యార్డును ఆయన సందర్శించారు. డంపింగ్‌యార్డులో చేయాల్సిన అభివృద్ధి పనులను కమిషనర్‌తో చర్చించారు. అదేవిధంగా శక్కర్‌నగర్ ఎక్స్ రోడ్‌లో పైప్‌లైన్ లీకేజీ పనులను ఆయన పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తదితరులున్నారు.

## తిర్మన్‌పల్లిలో కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త మృతి

**అక్షరటుడే ఇందల్వాయి:** మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త జంగిడి లక్ష్మి (55) మృతి చెందారు. మూడు రోజుల క్రితం క్రిమిసంహారక మందు సేవించిన లక్ష్మిని నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. చికిత్స పొందుతూ ఆమె శనివారం మృతి చెందినట్లు తెలిసింది. ఆమెమృతిపట్ల కాంగ్రెస్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కృషి చేసే లక్ష్మి మృతి చెందడం పార్టీకి లోటని అన్నారు. ఆమె మృతికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

## మక్కలపై అదుపు తప్పిన బైక్.. ఒకరి మృతి

**అక్షరటుడే, కామారెడ్డి:** రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలపై బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తాడ్వాయి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందాపూర్‌కు చెందిన పైడి చిన్న గంగారెడ్డి (60) బైక్‌పై తాడ్వాయికి బయలుదేరాడు. గ్రామ శివారులో రహదారిపై మొక్కజొన్న కుప్పలు ఉండడంతో వాటిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన గంగారెడ్డిని జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. వైద్యులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేసినా బతకలేదు. రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర రైతులకు గతంలోనే విజ్ఞప్తి చేశారు. అయినా రైతులు మాత్రం ధాన్యం ఆరబోసేందుకు సరైన స్థలాల్లేక రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారు.

# కానిస్టేబుల్ హత్యకేసు నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** కానిస్టేబుల్‌పై దాడిచేసి హత్య చేసిన రౌడీషీటర్ రియాజ్‌ను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ శశిధర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిందితుడి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలు కాపాడే పోలీసులనే హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసుశాఖలో మంచి పేరున్న సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను అతికిరాతకంగా హత్యచేసిన రియాజ్‌ను వీలైనంత త్వరగా పట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇందూరు జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, కంఠేశ్వర్ జోనల్ ఇన్‌ఛార్జి దుర్గాదాస్, గోపి, కార్తీక్, చంద్ర, అఖిలేశ్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

### తెయూలో రౌడీ షీటర్ దిష్టి బొమ్మ దహనం

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** నగరంలో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్యకు నిరసనగా తెలంగాణ యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేశారు. ఆర్ట్స్ కళాశాల ఎదుట రియాజ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిందితుడిని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.


నిజామాబాద్ నగరంలో ఆందోళన నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు


తెలంగాణ యూనివర్సిటీలో..



## మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**అక్షరటుడే, బీర్కూరు:** మండల కేంద్రంలో హైదరాబాద్ మున్నూరు కాపు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన కాపు విద్యార్థులకు శనివారం పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్‌లో 90 శాతం మార్కులకుపైగా సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, గోల్డ్‌మెడల్స్‌తో పాటు రూ.2వేల నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఉపాధ్యాయులు మేకల విఠల్ మాట్లాడుతూ.. మున్నూరు కాపు ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ యామ రాములు, సొసైటీ ఛైర్మన్ ఇంగురాములు, ఉపాధ్యాయులు కంఠం శ్రీనివాస్, నారం వెంకటి, సత్యం, మద్దూర్ నర్సింలు, గాలయ్య, సురేష్ పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘం సభ్యులకే చేపల వేట హక్కు

**అక్షరటుడే, బాన్సువాడ :** మత్స్య సహకార సంఘం సభ్యులకే చెరువుల్లో చేపలు పట్టే హక్కు ఉందని ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి డోలిసింగ్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. చెరువుల్లో చేపల వేట హక్కులను దళారులకు లేదా ఇతరులకు అప్పగించడం చట్టవిరుద్ధమని ఆయన హెచ్చరించారు. అలాంటి ఘటనలు గుర్తించిన వెంటనే సంబంధిత సంఘాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్స్య సహకార సంఘాల ద్వారా మాత్రమే చేపల వేట కొనసాగించాలని, ప్రభుత్వం అందించే ప్రయోజనాలు కూడా సంఘ సభ్యులకే అందుతాయని తెలిపారు. ఈ నిబంధనలను అతిక్రమించి మత్స్యకారులు వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్స్యకారులు నేరుగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాలనుకుంటే నిబంధనలు పాటించాలని సూచించారు.



## పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై దృష్టి పెట్టాలి

**అక్షరటుడే, ఇందల్వాయి:** తల్లిదండ్రులు తమ పిల్లల శారీరక ఎదుగుదలతో పాటు మానసిక ఎదుగుదలపై దృష్టి పెట్టాలని డీఎంఈ స్వామి సులోచన అన్నారు. ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లులకు పిల్లల పెంపకంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లల ప్రవర్తనలో మార్పులు, వాటిని ఏ విధంగా సరిదిద్దాలనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పూదరి శ్యామల, గ్రామ విద్యా కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.



## అంత్యక్రియలకు ఆర్థికసాయం

**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్‌లోని ఒడ్డే సాంబయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే సాంబయ్యది పేద కుటుంబం కావడంతో అంత్యక్రియలకు సైతం డబ్బులు లేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు సామాజిక సేవా కార్యకర్త, బీఆర్ఎస్ నాయకుడు హాఖీం దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సద్దాం, నవీన్, సమీర్, పబ్బ శేఖర్, హైమద్, నవీన్, కుటుంబ సభ్యులు తదితరులున్నారు.